ప్రజాశక్తి

ఆదివారం 9 జూన్ 2024 5

శ్రీ సత్యసాయి

కుదిరేముఖ్‌లో కదలికొచ్చేనా..?

దశాబ్దకాలం దాటినా ఒప్పందాలకే పరిమితం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమలో ఇప్పటికైనా కదలిక వచ్చేనా అన్నది చూడాల్సి ఉంది. 2012లో కుదురేముఖ్ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఒప్పందం జరిగింది. అయితే ఇప్పటికీ దీనిలో కదలికలేదు. ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే సుమారు మూడు వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ పరిశ్రమ ప్రకటన జరిగి దశబ్దకాలం దాటినా ముందుకు కదలడం లేదు. కొత్తగా వచ్చే ప్రభుత్వం అయినా దీనిపై దృష్టి సారిస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

2012లో ఒప్పందం

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలో కుదురేముఖ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్రీయ ఇస్పాత్ లిమిటెడ్, ఎపిఎండిసి, కుదురేముఖ్ మూడూ త్రైపాక్షి ఒప్పందం చేసుకున్నాయి. డీ.హీరేహాల్ మండలంలోని ఇనుప గనుల్లో ముడి ఇనుము తవ్వకాలు జరిపి ఉక్కు గుళ్లను తయారు చేయాలని నిర్ణయించారు. దీన్ని కొంత భాగం వైజాగ్ ఉక్కు పరిశ్రమకు కేటాయించగా, తక్కినది బయట అమ్ముకునే వీలుగా ఒప్పందాలు జరిగాయి. ఈ మేరకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయంలో ఈ ఒప్పందం జరిగింది. దీని వల్ల ప్రత్యక్షంగా మూడు వేల మందికి ఉపాధి లభిస్తుందని కూడా ప్రకటించాయి. ఈ మేరకు స్థల పరిశీలన, భూమిపూజ కూడా జరిగింది. అయితే ఇది అంతటితోనే ఆగిపోయింది.

అటకెక్కిన ఉక్కు పరిశ్రమ

కుదిరేముఖ్‌ను ఏర్పాటు చేస్తామని 2014లో కొత్తగా అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. ఆ ఐదేళ్లలో దీని గురించి పట్టించుకోలేదు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి కూడా దీని ఊసే ఎత్తలేదు. కొత్తగా ఇప్పుడు అదికారంలోకి వస్తున్న తెలుగుదేశం ప్రభుత్వమైనా దీనిపై దృష్టి సారిస్తుందా లేదా అన్నది చర్చ నడుస్తోంది. ఉపాధి కల్పించే పేరుతోనే కూటమి ఇప్పుడు అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వ రంగంలో మూడు సంస్థలు కలిపి ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలతోపాటు, జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడే అవకాశాలున్నాయి.

ఇనుప గనులపై ప్రయివేటు కన్ను

అపాపర ఖనిజ సంపదున్న డీ.హీరేహాల్ మండలంలోని ఇనుప ఖనిజంపై ప్రయివేటు కన్ను ఉంది. గతంలో ఇదే రకంగా ప్రయివేటుకు కేటాయించి పెద్దఎత్తున అవినీతి

చోటు చేసుకున్న విషయం తెలిసిందే. వేల కోట్ల ఖనిజ సంపద అన్యాక్రాంతమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వ రంగంలో అయితే ప్రజలకు ఉపయోగమని కుదురేముఖ్‌కు కేటాయించారు. దీనిలో మాత్రం ఇప్పటికీ కదలిక రావడంలేదు. దీని వెనుక కొంత మంది ప్రయివేటు వ్యక్తుల కన్ను ఉండటంతోనే కదలిక లేకుండా ఉందన్న విమర్శలున్నాయి.

గొడవలతో జీవితాలు నాశనం :ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

గ్రామాల్లో గొడవల జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని, అందరూ స్నేహభావంతో కలిసి ఉండాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలియజేశారు. జిల్లాలోని ధర్మవరం సబ్ డివిజన్‌లోని రామగిరి మండలం కుంటిమద్ధి, పోలేపల్లి గ్రామాల్లో శనివారం సందర్శించారు. గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు. అనవసరంగా ఆవేశాలు, బావోద్వేగాలతో హింస, గొడవలు చెలరేగే విధంగా ప్రవర్తించరాదన్నారు. హింసాత్మక ఘటనలు, ఘర్షణలకు ఎవరు దిగినా చట్టం ముందు అందరూ సమానమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఏవైనా ఘటనలు తలెత్తితే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని పోలేపల్లి, ప్యాదిండి గ్రామాల్లో పర్యటించి అక్కడి తాజా పరిస్థితులను గ్రామస్తులతో తెలుసుకున్నారు. ధర్మవరం టౌన్‌లో పర్యటించి అక్కడ శాంతి భద్రతల పరిస్థితులను సమీక్షించారు. ఈవీఎం భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ధర్మవరం సబ్ డివిజన్లో సమస్యత్మక గ్రామాలు మొత్తం కలియ తిరిగారు. అల్లర్లు, గొడవలు జోలికెళ్లకుండా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, సిఐ లు, శివాంజనేయులు, అశోక్ కుమార్, ఎస్బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు : ఎస్పీ

ఎన్నికల ఫలితాల అనంతరం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రాం తదితర సోషల్ మీడియాలో చాలా మంది రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నట్లు తెలుస్తోందని, ఇలాంటి వాటిపై కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ మాధవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. వాళ్లింటిని ముట్టడిస్తాం... వీళ్లింటిని ముట్టడిస్తాం... దాడులు చేస్తాం... అంటూ బెదిరింపులు లేదా తీవ్రమైన హెచ్చరికలు చేస్తూ పోస్ట్‌లు, వ్యక్తిగత దూషనులు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో సందేశాలు చేస్తున్నారన్నారు. ఇలా రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడే పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో ఈతరహా పోస్టులు పెట్టె వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫేస్ బుక్, వాట్సాప్‌లలో గ్రూప్‌అడ్మిన్‌లు, గ్రూప్ సభ్యులు ఏదిబడితే అది పోస్ట్ చేయకుండా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలన్నారు. లేకుంటే గ్రూప్ సభ్యులు చేసిన పోస్టులకు కూడా గ్రూప్ అడ్మిన్లే బాధ్యులు అవుతారని తెలియజేశారు. రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు, తప్పుడు ప్రచారాలు అయితే చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. రెచ్చగొట్టే పోస్ట్‌లు, ఫొటోలు, వీడియోలను షేర్ చేయడం లేదా స్టేటస్‌లుగా పెట్టడం కూడా నిషిద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంలో వాట్సాప్‌లోని గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీకనకదాస ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కనకదాస కళ్యాణ మండపంలో కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పూజారి రెడ్డప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు గోపాల్, ఎంఈఓ మాట్లాడుతు విద్యార్థులు చక్కగా చదువుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి శేఖర్ మాట్లాడుతు ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివించాలని కోరారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎ బాలాజీ, ఎస్‌టిఓ జగదీష్ మాట్లాడుతూ ప్రతిభావంతుల స్ఫూర్తితో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం పదో తరగతి, ఇంటర్, జేఈఈ మెయిన్స్, నీట్‌లో ప్రతిభ కనబరిచిన 200 మంది కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మహేష్‌గౌడ్, తాలూ కా కురుబ సంఘం నాయకులు ఆంజనేయులు, గంగాధరప్ప, రామకృష్ణప్ప, లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీనివాసులు, హనుమంతప్ప, తిమ్మప్ప, వెంకటరమణ, రాజగోపాల్, సూర్య నారాయణ, నాగరాజు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేషనల్ మీన్స్ పరీక్షల్లో సత్తా చాటిన భానుతేజ, అభిలాష్

నేషనల్ మీన్స్ పరీక్షల్లో 'మోద' విద్యార్థుల సత్తా

పరిగి-ప్రజాశక్తి

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో పరిగి మండలంలోని మోద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. విద్యార్థులు భానుతేజ (110), అభిలాష్ (108) మార్కులు సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ. 12వేల చొప్పున నాలుగేళ్ల స్కాలర్‌షిప్ అందుతుందని శిక్షకులు రాజశేఖర్, రామారెడ్డి వెల్లడించారు. విద్యార్థులు, శిక్షకులను ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పేదలకు వైద్యం చేయడంలో ఎంతో సంతృప్తి

యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేద ప్రజలకు వైద్యం చేయడంలో ఎంతో సంతృప్తి, ఆనందం ఉన్నాయని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, ఉపాధ్యక్షులు సుకుమార్, కార్యదర్శి జయరాం, కోశాధికారి బండి నాగేంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దివంగత వెంకట లక్ష్మమ్మ, చింతా ఈశ్వరయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు చింతా శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులు సహాయ సహకారాలతో యువర్స్ ఫౌండేషన్, నేత్రాలయ ఐ క్లినిక్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప వారిచే ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. శిబిరంలో 146 మందికి వైద్య పరీక్షలు చేసి 110 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారని, వీరికి ఉచిత రవాణా ఖర్చులతో పాటు ఆపరేషన్ చేయించి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. పేద ప్రజలు ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుని కంటి వెలుగును పొందాలని సూచించారు. కార్యక్రమంలో సహకార దర్శి నాగార్జున, పిఆర్‌ఓ రాధాకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, క్యాంపు ఛైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, చాంద్‌బాషా, స్టార్ ఖలీల్, మహేష్‌బాబు, బండ్లపల్లి రంగనాథ్, పోలా ప్రభాకర్, వైకె.శ్రీనివాసులు, సత్రశాల మల్లికార్జున, వి.ప్రసాద్, నామాల శ్రీనివాసులు, వాసుదేవుడు, ఆప్తమాలజీ టెక్నీషియన్ నాగరాజాచారి, కోఆర్డినేటర్ లక్ష్మణ్ ఆదిశేషు, ఊకా సతీష్, రామచంద్రగుప్తా, మామిళ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

మృతి చెందిన జింక

ప్రజాశక్తి-హిందూపురం

గోరంట్ల మండలం పులేరు గ్రామ సమీపంలో శనివారం నాడు కుక్కల దాడిలో గాయపడిన జింక మృతి చెందింది. కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి పడివ ఉన్న జింకను గుర్తించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అధికారులు అక్కడికి వెళ్లి గాయపడిన జింకను వైద్య సేవల నిమిత్తం గోరంట్ల పశు వైద్యశాలకు తరలించారు. పశు వైద్యాధికారి గాయపడిన జింకకు చికిత్స నిర్వహిస్తుండగా అది చనిపోయింది. మృతి చెందిన జింకను పంచనామా చేసి, దహనం చేసినట్లు అటవీశాఖ అధికారి రాహుల్ తెలిపారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ప్రిన్సిపల్ చెన్నా రామ్మూర్తి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశానికి ఈనెల 10వ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఐటిఐ బాలుర ప్రిన్సిపల్ చెన్నా రామ్మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలుర పారిశ్రామిక శిక్షణా సంస్థ ఐటిఐలో చేరడం ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఐటిఐలో ఎలక్ట్రీషియన్, మెకానిక్ ట్విట్టర్, గ్రైండర్ మెకానిజం, మోటార్ వెహికల్ మెకానిజం, డీజిల్ మెకానిజం, వైర్మాన్ వెల్డర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిజం వంటి కోర్సులు ఉన్నట్లు చెప్పారు. ఐఐటి కోర్సు పూర్తయిన వెంటనే ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న అప్లికేషన్, సర్టిఫికెట్లను దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించా రు. 10వ తరగతి పాసైనా, ఫైయిల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేలకొరిగిన భారీ వృక్షం

బొమ్మనహాల్ : గాలివానకు మండలంలోని దేవగిరి క్రాస్ సమీపంలో శనివారం భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో కణేకల్ నుంచి బళ్లారికి వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నేలకొరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రం వరకూ ట్రాఫిక్ క్లియరెన్స్‌కు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులే తొలగించే ప్రయత్నాలు ప్రారంభించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ రాజీనామా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాజీనామా లేఖను చూపుతున్న ఉమాదేవి

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎల్‌ఎం.ఉమాదేవి రాజీనామా చేశారు. శనివారం తన రాజీనామా పత్రాన్ని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ప్రసన్న కుమార్, కలెక్టర్ వినోద్ కుమార్‌కు పంపారు. తన రాజీనామాను తక్షణమే అమోదించాల్సిందిగా లేఖలో ఆమె కోరారు.

పద్మ, టెన్సింగ్ నార్గే

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన, సేవలందించిన వారు పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి జిల్లా ఆల్ సెట్ జిల్లా యువజనుల సర్వీస్ శాఖ సీఈవో కరుణకుమారి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత హోం మంత్రిత్వ శాఖ 2025 రిపబ్లిక్ డే సందర్భంగా ఎంపికైన వారికి పద్మ అవార్డులు అందజేస్తుందన్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక, సాంఘికంగా అందించిన సేవలు, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజా సంబంధాల సివిల్ సర్వీస్, ట్రేడ్, ఇండస్ట్రీ, తదితర రంగాల్లో ఉత్తమ సేవలు, ప్రతిభ కనబరిచిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే ప్రతిభ కలిగిన వారు టెన్సింగ్ నార్గే జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2021, 22, 23 సంవత్సరాల్లో భూమి, నీరు(సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస అంశాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి రాష్ట్రపతి ద్వారా టెన్సింగ్ నార్గే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసా పత్రాలు, రూ. 15 లక్షల నగదు అందజేస్తారన్నారు. ఈ నెల 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలన్నారు.

హిందూపురంలోని ఈఎస్ఐ అసుపత్రి

ఇఎస్ఐ ఆసుపత్రికి అనారోగ్యం..!

- రెండేళ్లుగా 'పురం' ఈఎస్ఐ ల్యాబ్ మూత
- మందులు... వైద్యులు.. సిబ్బంది కొరత
- 406 రకాల మందులు రావాల్సి ఉంటే, అందుబాటులో 50 రకాలే..!
- కార్మికులకు అందని ఇఎస్ఐ వైద్యం

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలో కార్మికులకు వైద్యసేవల పరంగా వరంగా ఉండాల్సిన హిందూపురం ఈఎస్ఐ అసుపత్రికి అనారోగ్యం పట్టుకుంది. రెండేళ్లుగా ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవడంతో ల్యాబ్ మూతబడింది. 406 రకాల మందులు పంపిణీ చేయాల్సి ఉంటే కేవలం 50 రకాల మందులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. మదనపల్లి నుంచి పురానికి ఒక వైద్యుడుని డిప్యూటేషన్ విధానంలో నియమించారు. ఆయన వారంలో ఒక రోజు అలవచ్చి ఇలా వెళ్లిపోతుంటారు. నర్సింగ్ సిబ్బంది వచ్చే రోగులను పరీక్షించి, అక్కడున్న మందులను ఇస్తున్నారు. దీర్ఘకాలిక రోగుల పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉంటోంది. బిపి కోసం 8 రకాల మందులు రావాల్సి ఉంటే 2 రకాలు, షుగర్ కోసం 6 రకాల మాత్రలు రావాల్సి ఉంటే మూడు రకాలు మాత్రలు సరఫరా చేస్తున్నారు. ఇవి కుడా వైద్య సిబ్బంది ఒకటికి పది సార్లు ఇండెంట్ పెట్టి కార్మికులు తమపై తిరగబడుతున్నారు అంటే తప్పా ఆసుపత్రికి పంపడం లేదు. ఇఎస్ఐ ఆసుపత్రిలో సరిపడా మందులు లేకపోవడంతో వ్యాధులు నయం చేసుకునేందుకు బయట మార్కెట్‌లో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

హిందూపురం ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య చికిత్సల నిమిత్తం పెద్ద సంఖ్యలోనే నిత్యం కార్మికులు వస్తుంటారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా పరిశ్రమలు ఉండడంతో వాటిలో దాదాపు 20 వేల మంది కార్మికులకు పైగా పనులు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80వేలకు చేరుకుంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఈఎస్ఐ వాటాను ప్రభుత్వనికి ప్రతి నెలా చెల్లిస్తున్నారు. ఈఎస్ఐ అసుపత్రిలో కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లీనిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి ఈఎస్ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం కడపలో ఉంది. 28 డిస్పెన్సరీలు ఆదోని, తిరుపతిలో ఆస్పత్రులు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఈఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏఏ మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. హిందూపురంతో పాటు అనంతపురం, కర్నూల్, కడప జిల్లాలకు ఆదోనిలో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా అవుతాయి. గత మూడు సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో మందులు సరఫరా కావాడం లేదు.

మందుల కొరత

ప్రభుత్వం మందులు సరఫరా చేసే కంపెనీలకు బకాయిలు చెల్లించడం లేదు. దీంతో కంపెనీలు ఈఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదు. మూడు నెలలకు ఓ సారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 406 రకాల మందులను డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత తదితర వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయింది. 406 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావాడం లేదు.

రెండేళ్లుగా ల్యాబ్ మూత

హిందూపురం ఈఎస్ఐ అసుపత్రి రక్త పరీక్షల విభాగంలో టెక్నీషియన్ ఉన్నారు. ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా లేక రెండేళ్లుగా ల్యాబ్ మూత పడింది. గతంలో అధునాతన యంత్రాలతో దాదాపు 20 రకాల రక్త పరీక్షలు నిర్వహించే వారు. ప్రస్తుతం హెచ్‌బి పరీక్ష మాత్రమే చేస్తున్నారు. రోగ నిర్ధారణ అనంతరమే వైద్యులు రోగులకు వైద్య సేవలను అందిస్తారు. రోగ నిర్ధారణ కోసం కార్మికులు వేలాది రూపాయాలు చెల్లించి బయట ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయించుకుని ఈఎస్ఐ ఆసుపత్రికి రావాల్సి ఉంది.

మందులే కాదు.. సిబ్బందీ కొరతే..

హిందూపురం ఈఎస్ఐ అసుపత్రిలో ముందుల కొరతే కాదు సిబ్బంది కొరతా తీవ్రంగా ఉంది. హిందూపురం, కొట్నూరు రెండు డిస్పెన్సరీలు ఒకే చోట నిర్వహిస్తున్నారు. కనీసం ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్‌ఒతో పాటు క్లాస్-4కు సంబంధించి అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్యాలయంలో ఉండాల్సిన సీనియర్ అసిస్టెంట్‌లు సైతం లేరు. దీంతో రోగులతో పాటు వైద్యులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

కార్మికులకు భారంగా వైద్యం

చాలా మంది కార్మికులు అరకొర జీతాలు, సంపాదనతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏదైనా జబ్బుచేస్తే ఈఎస్ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. ఈఎస్ఐ డిస్పెన్సరీలో కూడా మందులు కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మందులు ఇంజెక్షన్ల కోసం సుమారు రూ.2 నుంచి రూ.3 వేల విలువజేసే మందులను ఉపయోగిస్తుంటారు. క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సి ఉంది. ఇప్పుడు ఈఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు గడిచిన మంజూరు కావాడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ అసుపత్రుల్లో ఈఎస్ఐ కార్డు ఉన్న వారికి వైద్య సేవలు అందించమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు పేర్కొంటున్నారు. దీనికి కారణం ఈఎస్ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాక పోవడమే. ప్రతి నెలా కార్మికులు ఈఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికి వైద్య సేవల కోసం అప్పులు చేసి, మొయలేని భారాన్ని మొయాల్సి వస్తున్నది.



పని చేయకుండా ఉన్న ల్యాబ్ పరికారాలు

సౌకర్యాలు మెరుగుపర్చాలి



జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి హిందూపురం ఈఎస్ఐ అసుపత్రి. ఈ అసుపత్రిలో మందులు, వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. సమస్యలను పరిష్కరించి ఈఎస్ఐ సేవలను కార్మికులకు అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వాలు స్పందించకుంటే కార్మికుల పక్షాన ఆందోళనలు నిర్వహిస్తాం.

ఈఎస్.వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి.

పుట్టపర్తిలో ఓటమి..

వైసిపి శ్రేణుల్లో అంతర్మథనం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజక వర్గంలో వైసిపికి ఎలాంటి ఢోకా లేదనుకున్న ఆ పార్టీ శ్రేణుల్లో ఓటమి పట్ల అంతర్మథనం మొదలైంది. ఎన్నికల ముందు ఆ పార్టీ శ్రేణులు గెలుపుపై ధీమాగా ఉండేవారు. కనీసం 10 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామని భావించా రు. అందుకనుగుణంగానే ఓట్ల లెక్కింపు సమయంలో మొదటి రౌండ్‌లో 300 ఓట్లకు పైగా వైసిపికి మెజార్టీ కూడా వచ్చింది. ఆ తర్వాత రౌండ్లలో నువ్వా.. నేనా.. అన్నట్లు కౌంటింగ్ సరళి సాగింది. కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ మండలాలపై వైసిపి పెట్టుకున్న ఆశలు నిజమయ్యాయి. అయితే టిడిపి కంచుకోట అయిన పుట్టపర్తి మండలంతో పాటు పట్టణం టిడిపి అభ్యర్థిని గట్టుకు చేర్చాయి. నల్లమాడ దాటే వరకూ వైసిపి 5 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో కొనసాగింది. ఓబుళదేవరచెరువు, అమడగూరులో టిడిపికి మెజార్టీ రావడంతో వైసిపి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై టిడిపి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డి 9వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా వైసిపి 11 సీట్లు మినహా అన్ని స్థానాల్లో ఓడిపోవడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. నియోజకవర్గం పరంగా చూసినప్పుడు ఏ మండలం లో ఎందుకు ఓట్లు కోల్పోయామన్న వివరాలపై దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో పాటు ఆ పార్టీ శ్రేణులు లెక్కలు వేసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు అందించామని, డబ్బులు కూడా ఓటర్లకు పంచామని మరి ఓటమి ఎందుకు ఎదురైందన్న దానిపై లోతుగా విశ్లేషిస్తున్నట్లు సమాచారం. ఓటరు ఎక్కడా బయటపడకుండా సైలెంట్‌గా టిడిపికి ఓట్లు వేశారని, ఇంత వ్యతిరేకత ఎక్కడా ఎప్పుడు కనిపించలేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఏదేమైనా ఓటర్ల తీర్పును గౌరవిస్తూనే పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

'పురం' టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్‌కు బైక్ అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

హిందూపురం సోషల్ మీడియా పార్లమెంట్ కోఆర్డినేటర్ తోట వాసుదేవ టిడిపి కోసం విశేష కృషి చేసినందుకు సందా రాఘవ తన వంతుగా హోండా యాక్టివ్ టూ వీలర్‌ను బహుమతి అందజేశారు. తోట వాసుదేవ మాట్లాడుతూ ఐదేళ్లుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో టిడిపి బలోపేతం కోసం తనవంతుగా కృషి చేశానని తెలిపారు. టిడిపి కోసం కష్టపడిన తన శ్రమను గుర్తించి సందా రాఘవ బ్రదర్స్ బైక్‌ను బహుమతిగా ఇవ్వడం మరిచిపోలేని తెలిపారు.

తోట వాసుదేవకు బైక్ అందజేస్తున్న సందా రాఘవ బ్రదర్స్

బొడ్రాయి వినాయకుని వద్ద కొబ్బరికాయలు కొడుతున్న గిర్రాజు నగేష్, నాయకులు

సత్యకుమార్‌తోనే ధర్మవరం అభివృద్ధి

గిర్రాజు నగేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్ తప్పక కృషి చేస్తారని, ఇచ్చిన మాటను అమలుపరుస్తారని బిజెపి నాయకులు గిర్రాజు నగేష్ తెలిపారు. బిజెపి విజయం సాధించడం పట్ల శనివారం నగేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు 15 వార్డులో ర్యాలీ నిర్వహించి బొడ్రాయి వినాయకుని వద్దకు చేరుకుని 101 కొబ్బరికాయలు కొట్టి అభిమానం చాటుకున్నారు. నగేష్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా నియోజకవర్గం అభివృద్ధి చెందకపోవడంతో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. నేడు బిసి అభ్యర్థి ఎమ్మెల్యేగా రావడంతో కష్టాలు తీరుతాయని స్పష్టం చేశారు. 15 అవార్డులో సత్యకుమార్ యాదవ్‌కు అత్యధిక ఓట్లు వేసి మెజార్టీతో గెలిపించిన సందర్భంగా ఈ సంబరాలు చేసుకుంటున్నా మన్నారు. సత్యకుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని వారు చంద్రబాబుకు విన్నవించుకున్నారు. సత్యకుమార్ యాదవ్ మంత్రి అయితే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ విజయం ధర్మవరం ప్రజలదని, వార్డు ప్రజల ఆనందమే మా ఆనందమని తెలిపారు. కార్యక్రమంలో లాయర్ చంద్రమౌళి, గిర్రాజు ప్రసాద్, మహేష్, కోటం రవి, సురేష్, శ్రీనివాసులు, భరత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల కేంద్రమైన ఓబుళదేవరచెరువుకి సమీపంలో ఎం.కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఈ నెల 16వ తేదీ ఆదివారం కాలజ్ఞాని శ్రీపోతులూరి వీరబ్రహ్మేం ద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులునాయుడు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ గౌడ్ అందించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని శనివారం జలాలతో శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ గౌడ్ సహాయ సహకారాలతో ఉపాలయ నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ హెడ్ కానిస్టేబుల్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ఉభయదారులతో కలిసి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేపట్టి అనంతరం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఉపాలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట సేవా కార్యక్రమాలు చేపడుతున్న హెడ్ కానిస్టేబుల్ గౌడను పలువురు అభినందించారు. ఈ నెల 16వ తేదీ విగ్రహ ప్రతిష్ట, అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో పాల్గొని శుభప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి పుల్లప్ప, టైలర్ నిజాం, కదిరి జోగి శ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ కోడూరు శ్రీకాంత్, ఈశ్వరమ్మ, ఆలయ పూజారి వెంకటరమణ, ధర్మప్రచార మండల ప్రముఖ్ సుబ్బరాజు, టైలర్ రాము, మల్లెల రమేష్, రాధాకృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా వాసుల పర్తియాత్ర

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

అనంతపురం జిల్లాకు చెందిన సుమారు 2,500 మంది సత్యసాయి భక్తులు శనివారం పర్తియాత్రగా పుట్టపర్తికి చేరుకున్నారు. వారు రెండు రోజుల పాటు సాగే కార్యక్రమాల్లో పాల్గొనడానికి ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ఉదయం సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ జరిగే భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రపంచ శాంతిని కోరుతూ సహస్ర పారాయణం పఠించారు. వారు మాట్లాడుతూ ఏడాదికి ఓ సారి సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పర్తియాత్రగా ప్రశాంతి నియానికి వస్తున్నామన్నారు. సాయంత్రం 'సాయి ప్రేమ అనంతం' అనే నాటిక అనంతరం సంగీత కచేరీ నిర్వహించారు. రెండో రోజు ఆదివారం కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

'కందికుంట'ను మంత్రి పదవి వరించేనా..?

చేనేత సామాజిక వర్గంలో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మొన్నటి దాకా రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ ఉండేది. జూన్ 4వ తేదీ వెలువడిన ఫలితాల్లో కూటమి ఘనవిజయం సాధించడంతో ఇప్పుడు ఎవరిని మంత్రి వరిస్తుందో అనే కుతూహలం ప్రజల్లో ఎక్కువుగా కనిపిస్తుంది. కూటమి క్లీన్ స్వీప్ చేసిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో అయితే మరింత ఎక్కువుగా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా అంటేనే టిడిపికి పెట్టని కోట అని తెలుగు తమ్ముళ్లు చెప్పుకుంటున్నారు. ఈ జిల్లాలో బిసిల్లో బలమైన నాయకుడు కందికుంట వెంకట ప్రసాద్ అని చెప్పవచ్చు. దీనికి తోడు చేనేత సామాజిక వర్గం నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కందికుంట. కదిరి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా బలమైన నాయకుడు అనే పేరు ఉంది. వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గమైన పులివెందుల పక్క నియోజకవర్గమే కావడంతో వైఎస్ఆర్ కుటుంబం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా ముస్లిం మైనార్టీ ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టుబట్టి ఇక్కడ మైనారిటీ అభ్యర్థికి టికెట్ ఇచ్చి పదుల సార్లు ప్రచారం చేసి ఎలాగైనా కందికుంటను ఓడించాలని చేయని ప్రయత్నం లేదని వైసిపి, టిడిపి నాయకులే చర్చించుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 'నేనే కదిరి ఎమ్మెల్యే అభ్యర్థిని' అని పెద్దిరెడ్డి పలుమార్లు స్థానిక వైసిపి నాయకుల చెవిలో ఊదినట్లు నేడు వైసిపి నాయకులే చర్చించుకుంటున్నారు. కోట్ల రూపాయలు కుమ్మరించి నాయకులను కొనడంతో పాటు ప్రజలకు డబ్బులు పంచి కందికుంటను ఓడించాలని ప్రయత్నించినట్లు వైసిపిలోనే కొందరు పేర్కొంటున్నారు. అయితే పెద్దిరెడ్డి కుయుక్తులు, కుట్రలను తన వ్యూహాలతో తిప్పికొట్టిన బిసి నాయకుడు కందికుంట అని టిడిపి నాయకులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. రాష్ట్రంలో చేనేత సామాజికవర్గం తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కందికుంట. ఈ సామాజికవర్గం ఈసారి టిడిపి వైపు బలంగా నిలబడింది. మంగళగిరిలో ఈ సామాజికవర్గం మద్దతు వల్లే టిడిపి యువ నాయకుడు నారా లోకేష్‌కి 90 వేల పైచిలుకు మెజారిటీ వచ్చిందనడంలో సందేహం లేదు. అటువంటి సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు ఇవ్వాలి అని టిడిపి అధినేత చంద్రబాబు నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారమని నియోజకవర్గ టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో గెలిచిన ఏకైక చేనేత సామాజిక వర్గం ఎమ్మెల్యే కందికుంటకు చంద్రబాబు మంత్రివర్గంలో పదవి ఖాయమని నియూజకవర్గ వ్యాప్తంగా చర్చ జోరందుకుంది.

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కంటి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కంటికి సంబంధించిన వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు సూచించారు. పట్టణంలోని ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక సూగూరు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో 109వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కుమార్ రాజా, ఉషారాణి మాట్లాడుతూ ఈ శిబిరానికి 600 మంది హాజరు కాగా అందులో 180 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారని, వీరందరినీ బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయించి, అనంతరం హిందూపురం తీసుకొస్తామని తెలిపారు. ప్రతి నెల తమ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తున్నామన్నారు. గత మే నెలలో ఆపరేషన్ చేయించుకున్న 150 మందికి తిరిగి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.

శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

శిబిరంలో కంటి వైద్య నిపుణులు దీక్ష, స్వాతి, శంకర్ నేత్రాలయ వైద్య సిబ్బంది, వాలంటీర్ రహంతుల్లా, వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మడకశిరకు నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో రోడ్ల నిర్మాణం కోసం రూ. 15 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయీ బ్రాహ్మణ సాధికార జిల్లా కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్ రాజు, తదితరులు విలేకరుల సమావేశం లో మాట్లాడారు. వారు విజయవాడలో నేషనల్ హైవే ఉన్నతాధికారితో మాట్లాడి మడకశిర అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ మండల కన్వీనర్లు మనోహర్ లక్ష్మీనారాయణ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తార్ సాబ్ కౌన్సిలర్లు ఉమాశంకర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

,శ్రీనివాసులు, సీనప్ప రాజా. హనుమంతు, క్లస్టర్ ఇంచార్జ్ నాగరాజు, తెలుగు యువత తిమ్మరాజు, జుంజప్ప, అశ్వత్, నాయకులు పాల్గొన్నారు.

క్లీన్ స్వీప్..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు గత వారంలో వెల్లడయ్యాయి. ఇందులో మొత్తం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలన్నింటిలోనూ కూటమే విజయం సాధించింది. ఈ ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్య చకితులను చేశాయి. జిల్లా చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా ఒకేపార్టీ అన్ని స్థానాల్లో రావడం ఇదే ప్రథమం. ఇది వరకు గరిష్టంగా 12 స్థానాల వరకే ఒక పార్టీ అత్యధికంగా గెలుపొందింది. ఈ ఎన్నికల్లో తొలి సారిగా అన్ని స్థానాలనూ ఒకేపార్టీ విజయం సాధించింది. జిల్లాలో అత్యధిక స్థానాల్లో కూటమి వస్తుందని భావించినప్పటికీ పూర్తి స్థాయి స్థానాలు రావడం ఎలా సాధ్యమన్న చర్చ నడుస్తోంది. ఓటమి చెందిన వైసిపి నేతలంతా ఇది ఎలా జరిగిందన్నది అంతుబట్టకుండా ఉన్నారు. తమ ఓటమికి కారణాలేమిటని విశ్లేషించుకునే పనిలో పడ్డారు. వైసిపి నుంచి పోటీ చేసిన ముఖ్యమైన నేతలంతా ఈ ఎన్నికల్లో ఓటమి చెందారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 13 స్థానాల్లో టిడిపి గెలుపొందగా, ధర్మవరం అసెంబ్లీ నియోజక వర్గంలో బిజెపి విజయం సాధించింది. రెండు పార్లమెంట్ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. రాష్ట్రంలోనూ కూటమి రావడంతో మంత్రివర్గ స్థానాలపై చర్చ నడుస్తోంది. ఈసారి ఎవరెవరికి మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లా నుంచిచోటు లభించనుందన్న చర్చ నడుస్తోంది. ఇప్పటికే ముఖ్య నేతలంతా మంత్రివర్గ స్థానంలో చోటు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రెండు రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరగనుంది. దీంతో ఆశావహులు ప్రయత్నాలు చేపట్టారు. సీనియర్ నాయకులుగానున్న కాలవ శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్, సత్యసాయికుమార్, పరిటాల సునీత తదితరులు మంత్రి పదవి కోసం పోటీపడుతున్న వారిలోనున్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి అవకాశం లభించనుందోనన్నది చూడాల్సి ఉంది.

ఈ వారంలో వాతావరణం అనుకూలంగా మారింది. వారం రోజులుగా వర్షాలు విస్తారంగ పడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు బాగా పడుతున్నాయి. చెరువులు, వాగులు వంకల్లోకి వరదనీరు చేరుతోంది. వర్షాలు బాగా పడతుండటంతో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఇక కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధిపైనా చర్చ నడుస్తోంది. గడిచిన ఐదేళ్లలో ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు అన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా ఆగిపోయింది. దీంతో నీటి నిర్వహణ కూడా ప్రతి ఏటా గగనంగా మారుతూ వస్తోంది. తక్షణ మరమ్మతులకు రూ.30 కోట్లకుపైగా నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. ఈ ప్రభుత్వమైనా సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారిస్తుందా.. లేదా అన్నది చూడాల్సి ఉంది. అంతేకాకుండా అనేక ప్రధానమైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో టిడిపి హయాంలో ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడివక్కడే అన్న చందంగా మారాయి. కొత్త ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు ఏమి చేపడుతుందన్నది చర్చ నడుస్తోంది. 2014లో అధికారంలోకి వచ్చాక పెనుకొండ వద్ద కియా పరిశ్రమ వచ్చింది. ఆ తరువాత నుంచి ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. కొత్తగా వచ్చే ప్రభుత్వం మరికొన్ని కొత్త ప్రాజెక్టులేమైనా తీసుకొస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

గొప్ప మార్గదర్శకుడు రామోజీరావు : టిడిపి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఈనాడు, రామోజీ సంస్థల అధినేత, అక్షర యోధుడు చెరుకూరి రామోజీరావు పరమపదించడం బాధాకరం అని పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం కదిరి మునిసిపల్ ఆఫీస్ ఎదురుగా ఏర్పాటు చేసిన సంతాప సభలో రామోజీ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కదిరి టిడిపి, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. రామోజీరావు మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, పలువురు జర్నలిస్టులు రాజకీయ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో మహాజన జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎల్లం రాజు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంగాధర్, టిడిపి నాయకులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్‌బాబు, ఉద్యోగ సంఘ నాయకులు, ఆనంద్, నాగరాజు, జర్నలిస్టు సంఘ నాయకులు, ఎల్లం రాజు, సోమశేఖర్, శ్రీనివాసులు, చలపతి, టిడిపి, బిజెపి నాయకులు సోము, రాజశేఖర్‌బాబు, రాజేంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. నాయకులు రామోజీరావు సేవలను కొనియాడారు. ఆయన మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఛైర్మన్ ఓబిరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, చింతలపల్లి మహేష్ చౌదరి, శ్రీశైలం పురుషోత్తం గౌడ్, నాగూర్‌హుసేన్, పాలెం వెంకటేష్, ఉప్పునేసినపల్లి సర్పంచి ముత్యాలప్పచౌదరి, రాళ్లపల్లి షరీఫ్, విజయసారథిచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పుట్టపర్తిలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో హనుమన్ సర్కిల్‌లో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, దేవానందరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీరామ్‌రెడ్డి, కేశవనాయుడు, అమ్మినేని సూరి, ముమ్మనేని గోపాల్ పాల్గొన్నారు. టిడిపి యువ నాయకులు రామ్, లక్ష్మణ్ ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని హిందూపురం ఎంపి బికె.పార్థసారథి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి టిడిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రవి శంకర్, మండల కన్వీనర్ సిద్దయ్య, నాయకులు పాలడుగు చంద్రశేఖర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయ గాయత్రి, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజూర్, జిల్లా మైనారిటీ అధికార ప్రతినిధి జావిద్, బోయ అనిల్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ హనుమంత నాయక్, అత్తరు ఖాదీర్, నాగప్ప, గోనిపేట వెంకటేష్, బాలు నాయక్, చంద్ర మౌళి(నాని), బిస్కెట్ ప్రసాద్, షీప్ ఫారం శీన, నరసింహులు, సంపత్ నాయక్, రాంపురం అంజి, శ్రీనివాసరెడ్డి, బాలు, శివయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సవితమ్మ ఆధ్వర్యంలో..

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాధవనాయుడు, కేశవయ్య, శ్రీనివాసులు, సిద్దయ్య, శ్రీరాములు, లక్ష్మీనారాయణరెడ్డి, బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రెడ్డి, మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్ టిడిపి కార్యాలయంలో సర్పంచి చంద్రప్ప, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు రామోజీరావు సేవలను కొనియాడారు. విజయవాడలో టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య చౌదరి, నాగరాజు, రవీంద్రారెడ్డి, రవికుమార్, శ్రీనివాస్ హాజరయ్యారు.

ముదిగుబ్బ : ముదిగుబ్బలో టిడిపి మండల కన్వీనర్ ఎ.ప్రభాకర్ నాయుడు, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, తెలుగు యువత నాయకులు వినోద్‌బాబు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కొత్తచెరువురూరల్ : కొత్తచెరువులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, శివ, వలిపి శ్రీనివాసులు, వంశీ, కిషోర్, నాని, వెంకటేష్, చంద్ర, పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రవీంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, ఫణిభూషణ్, షబ్బీర్ ప్గొన్నారు.

రొద్దం : స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో టిడిపి ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసింహులు, చిన్నప్పయ్య, నాయకులు వీరాంజనేయులు, వాల్మీకి చంద్రశేఖర్, హరీష్, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, మావుటూరు గోపాల్,మాజీ ఎంపీపీ నరసింహులు, తదితర పాల్గొన్నారు.

ధర్మవరం : టిడిపి కార్యాలయంలో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ కూలీ మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని శాంతినగర్ గ్యాస్ గొడన్ వద్ద ఓ పాత ఇంటిని తొలగించే క్రమంలో ఇంటి పైకి ఎక్కి పని చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మండల పరిధిలోని దర్శనమల గ్రామానికి చెందిన పోతలయ్య(44) మృతి చెందాడు. వివరాలు.. పోతలయ్య కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పట్టణానికి వెళ్లి ఓ పాత ఇంటిని తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తూ జారి కింద పడి మృతి చెందాడు. గమనించిన తోటి కూలీలు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. తదుపరి పరిస్థితి విషమించడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతడికి భార్య వెంకటలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కూలీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు, బంధువులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తండ్రి కనిపించడం లేదని కుమారుడి ఫిర్యాదు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీలోని పిఎం.తండాకు చెందిన బి.శ్రీనివాసులు నాయక్ కనిపించడంలేదని శనివారం ఆయన కుమారుడు మహేశ్వర నాయక్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు.. బి.శ్రీనివాసులునాయక్‌కు మతి స్థిమితం లేదని, దాదాపు నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడని, బంధువులు, తెలిసిన వారి వద్ద కూడా ఆచూకీ లభించలేదన్నారు. చుట్టుపక్కల మండలాల్లో విచారించిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

కనిపించకుండాపోయిన బి.శ్రీనివాసులు నాయక్

ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నరసింహులు

ఎమ్మార్పీఎస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని పావగడ రోడ్డులో శనివారం ఎంఆర్‌పిఎస్ కార్యాలయాన్ని గౌరవాధ్యక్షులు నరసింహులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి సామ్రాట్ మధు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు రంగనపల్లి రాయుడు, బండ్లపల్లి నరసింహులు, లక్ష్మీనరసింహప్ప, మనూరు గోవిందప్ప, ఎల్లోటి తిప్పన్న, చందకచర్ల గంగాధర్, హెచ్‌ఆర్ పాల్యం గంగాధర, ముత్యాలు, ఈరక్యాతప్ప, మదుడి భీమరాజు, ఎంపీటీసీ నాగోజి, చిగతుర్పి, రంగాధమ, పాల్గొన్నారు.

టిడిపి నాయకుని మృతికి సంతాపం

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని కల్లుమర్రి పంచాయతీలోని ఎల్లోటి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బీమ్లానాయక్ శనివారం మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే సర్పంచి నాగరాజు ఆ గ్రామం వెళ్లి బీమ్లానాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమ్లానాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచి నాగరాజు

బ్యాంకు ఉంటేనే ఎటిఎం కేంద్రం..!

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంలో బ్యాంకు పని దినాల్లో మాత్రమే ఎటిఎం కేంద్రం తెరుస్తారని, లేకపోతే మూసి ఉంటుందని వినియోగదారులు మండిపడుతున్నారు. ఎటిఎం కేంద్రాన్ని 24 గంటలు తెరచి ఉంచాల్సి ఉండగా రొద్దం శాఖ కెనరా బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన ఎటిఎం కేంద్రాన్ని బ్యాంకు పని దినాల్లో మాత్రమే తెరుస్తారని, మిగతా రోజుల్లో మూసి ఉంటుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. శుక్రవారం నుంచి ఎటిఎం కేంద్రం తెరచుకోవడం లేదని, దీనికి తోడు శుక్రవారం విద్యుత్ సరఫరా లేనందున బ్యాంకు సర్వర్ పని చేయలేదని వాపోయారు. ఇక శనివారం సెలవు కావడంతో ఎటిఎం కేంద్రం తెరచుకోకపోవడంతో నగదు కోసం వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేడు ఆదివారం కావడంతో ఏకంగా మూడు రోజుల పాటు ఖాతాదారులకు సమస్య తప్పడం లేదు. ఇకనైనా బ్యాంకు అధికారులు వినియోగదారుల ఇబ్బందులను గుర్తింరి ఎటిఎం కేంద్రం అన్నిరోజులూ 24 గంటలూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.